

ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ మేయర్ పారిజాతారెడ్డి

రంజాన్‌ను ముస్లింలు పవిత్రంగా జరుపుకోవాలి

సరూర్‌నగర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను ముస్లింలు పవిత్రంగా జరుపుకోవాలని, అల్లా ఆశీస్సులు వారిపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షిస్తున్నానని బడంగ్‌పేట్ మాజీ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి వెంకటాపూర్ 14వ డివిజన్‌లోని సుల్తాన్‌పూర్ మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేసి వారికి పండ్లు తినిపించారు. అనంతరం పారిజాతారెడ్డి మాట్లాడుతూ నెల రోజుల పాటు కొనసాగనున్న రంజాన్ పండుగకు ఎంతో ప్రాశస్త్యమున్నదని అన్నారు. కార్యక్రమంలో మసీదు పెద్దలు, స్థానిక ముస్లింలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హస్తినాపురం డివిజన్‌ను అభివృద్ధి చేస్తా

చంపాపేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ధైర్యంగా ముందుకు సాగుతూ హస్తినాపురం డివిజన్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతానాయక్ అన్నారు. డివిజన్‌లోని శివసాయినగర్‌కాలనీలో సోమవారం జీహెచ్ఎంసీ నిధులు రూ.25లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, మమత మల్లేష్‌గౌడ్, కాలనీ ప్రతినిధులు గోపాల్‌రెడ్డి, గంగాధర్, హనుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యం గల పైప్‌లైన్లు వేయాలి : పవన్‌కుమార్

కొత్తపేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ పరిధిలోని కాలనీల్లో పెరిగిన జనావాసాలకు అనుగుణంగా ఎక్కువ సామర్థ్యం గల పైప్‌లైన్లు వేయాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి అధికారులను కోరారు. సోమవారం ఆయన జలమండలి అధికారులను కలిసి కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ, తాగునీటి సరఫరా సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల నాటి డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. పలు కాలనీల్లో డ్రైనేజీ మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జీఎం బలరామ్, డీజీఎం రవీంద్రవర్మ, ఏఈ స్రవంతిరెడ్డి, నాయకులు మంచి రాజేష్, రమేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి

మద్యంప్రియులకు టీటీఐ డీడీ కౌన్సెలింగ్

కొత్తపేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కు లెక్చర్ హాల్‌లో సోమవారం టీటీఐ డీడీ కౌన్సెలింగ్‌కు 109మంది మద్యం ప్రియులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి, విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్ఓపీ అల్లూరయ్య వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం ప్రియులు మద్యంమత్తులో వాహనాలు నడిపే వేళ సామాజిక, కుటుంబ బాధ్యతలను గుర్తు చేసుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే మద్యం మత్తులో జరిగే వాహనాల ప్రమాదాలు నివారించవచ్చని తెలిపారు. ప్రమాదాల వీడియో క్లిప్పులు ప్రదర్శించారు. టీటీఐ ఆధ్వర్యంలో ఎస్ఐ నర్సింహారావు, సిబ్బంది రమేష్, హీరోమోటో కార్ప్ టీమ్, రాచకొండ పరిధిలోని ఎల్బీనగర్, చాణిక్యపురి, వనస్థలిపురం తదితర 16ప్రాంతాల్లో నిర్వహించిన ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాల్లో 668 మంది పాల్గొన్నారు.



సామూహిక గణపతి హోమం నిర్వహిస్తున్న వేద పండితులు, అర్చకులు

ఘనంగా సామూహిక గణపతి హోమం

చంపాపేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో సోమవారం సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని వేద పండితులు, అర్చకులు సకల కార్యసిద్ధి కల్గించే సామూహిక గణపతి హోమంను ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈవో ఎస్.లావణ్య, భక్తులు శ్రీ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు ఆర్.చంద్రకాంత్‌శర్మ, అర్చకులు సంతోష్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టెండర్ల ప్రక్రియ..

కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయానికి ఏడాది పాటు పూలఅలంకరణ, పాలు, పెరుగు, గోవులమేత, కూరగాయలు, టెంట్‌సామగ్రి సరఫరా హక్కుల నిమిత్తం జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ టి.శేఖర్, ఆలయ ఈవో.ఎస్.లావణ్య సమక్షంలో టెండర్‌దారులు సీల్‌బాక్స్‌లో వేసిన టెండర్లను సోమవారం వారు ఓపెన్ చేశారు. టెండరుదారుల సమక్షంలో సీల్డ్ టెండర్ ప్రక్రియను నిర్వహించారు. పూలు, పూలదండల సరఫరా, విద్యుత్ అలంకరణ, చలువ పందిళ్ల, స్టేషనరీ సరఫరా, ప్రింటింగ్, స్క్రాప్ సేకరణ టెండర్లను వాయిదా వేశారు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

ఎల్బీనగర్ : మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం సీతారామచంద్రస్వామి మూలమంత్ర సహిత మన్యుసూక్త హోమం, పూర్ణాహుతి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. దేవాదాయ శాఖ అధికారి ఉమారాణి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, మాజీ చైర్మన్ జగిని రమేష్, తలాటి రమేష్‌నేత, ఖిల్లా మైసమ్మ ఆలయం చైర్మన్ సురేష్, సాయికుమార్, రాజుశ్రీవాత్సవ్, లింగస్వామి, శ్యాంసుందర్, హరీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రతిష్టను దెబ్బ తీసేలా కుట్రలు

మన్సూరాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): లేనిపోని అసత్య ప్రచారాలతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రతిష్టను దెబ్బతీసేలా కుట్రలు పన్నుతున్నారని, మీరెన్ని కుట్రలు పన్నినా ఎమ్మెల్యే ప్రతిష్ట ఏ మాత్రం చెక్కు చెదరదని మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డిలు పేర్కొన్నారు. ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన పనులకే సోమవారం కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి మళ్లీ శంకుస్థాపన చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కేబీఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు వెంకట్రావు, ఎల్లస్వామి, భాస్కర్‌యాదవ్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసంలో
దివ్యాంగులకు ఐదు శాతం వాటా కేటాయించాలి

ఓల్డ్‌మలక్‌పేట్ : రాజీవ్ యువ వికాసం పథకంలో వికలాంగులకు ఐదు శాతం వాట కేటాయించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి జంగయ్య, జాతీయ కోర్ కమిటీ చైర్మన్ ఎల్.గోపాల్‌రావు, వైస్ చైర్మన్ అందె రాంబాబులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్యవర్మకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం యువ వికాసంలో భాగంగా రూ.6వేల కోట్లతో బడ్జెట్‌ను ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా ఈ లోన్‌లను మంజూరు చేయడం జరుగుతుందని ప్రభుత్వం తెలపడం అభినందనీయం అన్నారు.

ఇసుక కృత్రిమ కొరత సృష్టించి..

బీఆర్ఎస్ రూ.వేల కోట్ల దోపిడీ

- టీజీఎండీసీ చైర్మన్ అనిల్‌కుమార్
- అబ్దుల్లాపూర్‌మెట్‌లో శాండ్ బజార్ ప్రారంభం



శాండ్ బజార్‌ను ప్రారంభిస్తున్న టీజీఎండీసీ చైర్మన్ అనిల్‌కుమార్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఇసుక కృత్రిమ కొరత సృష్టించి బీఆర్ఎస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయల దోపిడీ చేసిందని టీజీఎండీసీ చైర్మన్ ఎరవత్రి అనిల్‌కుమార్ ఆరోపించారు. కొరత పేరుతో అక్రమదందాకు తెరలేపి సామాన్య ప్రజలకు ఇసుక దొరకకుండా చేశారని విమర్శించారు. టీజీఎండీసీ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ గండిమైసమ్మ ఆలయ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శాండ్‌బజార్‌ను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, టీజీఎండీసీ ఎండీ సుశీల్‌కుమార్‌తో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలా కాకుండా సామాన్య ప్రజలకు తక్కువ ధరకే ఇసుక అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి శాండ్‌బజార్‌లను ఏర్పాటు చేయించారని తెలిపారు. ఇసుక విషయంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే సామాన్యులకు ఇసుకను అందించనున్నట్లు తెలిపారు. నాణ్యమైన ఇసుక రూ. 1800, రెండవ రకం ఇసుక రూ.1600లకే లభిస్తుందన్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం అక్రమ మైనింగ్‌కు పాల్పడడమే కాకుండా బ్లాక్ మార్కెట్‌ను సృష్టించిందన్నారు. 2023 మార్చి నాటికి 52ఇసుక రీచ్‌ల ద్వారా 628కోట్ల ఆదాయం వస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం 2024లో కేవలం 26 ఇసుక రీచ్‌ల ద్వారానే 703కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. ఈ లెక్కన కోట్ల రూపాయలను మింగేశారని విమర్శించారు. అక్రమ మైనింగ్ విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. అక్రమ రోబో శాండ్‌పై కూడా విచారణ జరుగుతుందన్నారు. టీజీఎండీసీకి వచ్చిన ఆదాయాన్ని ప్రజా సంక్షేమానికి ఖర్చు చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో టీజీఎండీసీలో జరిగిన అక్రమాలపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలనలో ఇళ్లు కట్టుకోవాలనుకున్న పేద ప్రజలకు నాణ్యమైన ఇసుకను అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. అక్రమ మైనింగ్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీజీఎండీసీ జీఎం రాజశేఖర్‌రెడ్డి, మైనింగ్ ఏడీ నర్సిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీవాణి, పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒకే పనికి ఎమ్మెల్యే, కార్పొరేటర్ శంకుస్థాపన

- శంకుస్థాపన శిలాఫలకం వద్ద నిరసన వ్యక్తం చేసిన బీఆర్ఎస్ నాయకులు
- అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

హయత్‌నగర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శంకుస్థాపన చేసిన పనులను సోమవారం మరోసారి మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శంకుస్థాపన చేయడానికి వస్తున్నారని తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. కార్పొరేటర్ రాక ముందే సోమవారం ఉదయం మన్సూరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు వీరన్నగుట్ట పోచమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. దీంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ముందస్తు సమాచారం ఉన్న హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్‌తో పాటు పలువురు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని బీఆర్ఎస్ నాయకులను పోలీసులు కోరారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు రోడ్డు మీద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఈనెల 12వ తేదీన శంకుస్థాపన చేసిన పనులకు కార్పొరేటర్ మరోసారి ఎలా శంకుస్థాపన చేస్తారని రఘువీర్‌రెడ్డి సీఐతో వాగ్వాదానికి దిగారు. అదంతా నాకు తెలియదు లా అండ్ ఆర్డర్ సమస్య వస్తుంది కనుక ఈ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని ఆదేశించారు. దీంతో వారు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మా ఎమ్మెల్యే గారు ఇక్కడికి వస్తున్నారు.. మీరు మాట్లాడండి అంటూ రఘువీర్‌రెడ్డి సీఐకి ఫోన్ ఇచ్చారు. దీంతో సీఐ మాట్లాడుతూ ఏదైన ఉంటే ఎమ్మెల్యే నాకు ఫోన్ చేస్తారు కదా అంటూ ఫోన్ తీసుకోకుండా దాట వేశారు. పోలీసులు బలవంతంగా నిరసన వ్యక్తం చేస్తున్న 12మందిని అరెస్టు చేసి అబ్దుల్లాపూర్‌మెట్‌కు తరలించారు. రఘువీర్‌రెడ్డితో పాటు, జగదీష్‌యాదవ్, టంగుటూరు నాగరాజు, నర్సింహయాదవ్, చంద్రారెడ్డి, అనీల్‌కుమార్‌తో పాటు పలువురు ఉన్నారు.



వీరన్నగుట్ట వద్ద రోడ్డుపైన బైఠాయించిన బీఆర్ఎస్ కార్యకర్తలు



అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే - కార్పొరేటర్ మధ్య శంకుస్థాపన పంచాయితీ

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ నర్సింహారెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. నర్సింహారెడ్డి కార్పొరేటర్‌గా ఎన్నికైనప్పటి నుంచి ఇద్దరి మధ్య ఇదే పరిస్థితి నెలకొంది. ఈనెల 12న ఎమ్మెల్యే వీరన్నగుట్ట వద్ద గల పోచమ్మ ఆలయం వద్ద రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, రూ.10లక్షలతో చేపట్టిన ఓపెన్ జిమ్‌కు శంకుస్థాపన చేశారు. తనకు సమాచారం ఇవ్వలేదని కార్పొరేటర్ గైర్హాజరు అయ్యారు. ఎమ్మెల్యే మాత్రం అధికారులతోనే కార్పొరేటర్‌కు సమాచారం ఇప్పించామని అంటున్నారు. నాకు ఎవరు చెప్పలేదని కార్పొరేటర్ నా కొబ్బరికాయను నేను కొట్టుకుని మరోసారి శంకుస్థాపన చేస్తానని సోమవారం వీరన్నగుట్టకు వచ్చి మరో సారి రెండు పనులకు శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్‌ను అడ్డుకోవడానికి వచ్చిన బీఆర్ఎస్ నాయకులను హయత్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గతంలో పవనగిరి కాలనీలో ఒకే పనికి ఎమ్మెల్యే, కార్పొరేటర్ వేరు వేరుగా శంకుస్థాపనలు చేశారు.

బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసుల దాడిని ఖండిస్తున్నాం

బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు అరెస్టుచేసి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారని తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం అక్కడికి చేరుకుని కార్యకర్తలను పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమాచారం ఇచ్చిన మన్సూరాబాద్ కార్పొరేటర్ శంకుస్థాపన పనులకు రాలేదు. తాను శంకుస్థాపన చేసిన పనులు మరో సారి కార్పొరేటర్ శంకుస్థాపన చేయడాన్ని నిరసన తెలపడానికి వెళ్లిన బీఆర్ఎస్ కార్యకర్తల పైన హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్ క్రూరంగా వ్యవహరించారని అన్నారు. అసభ్య పదజాలంతో తిట్టి, బట్టలు చింపి, తొక్కి అరెస్టు చేసి లోపల వేశారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దీని పర్యావసానాలు వేరుగా ఉంటాయన్నారు.



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎల్బీనగర్ కాంగ్రెస్ నేతలు

అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేని అరెస్టు చేయండి

- ఎల్బీనగర్ కాంగ్రెస్ నేతల డిమాండ్, నిరసన



కంటతడి పెట్టిన సుజాతానాయక్

మన్సూరాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం మహిళా కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను నిరసిస్తూ ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద సోమవారం పెద్దఎత్తున నిరసన తెలిపారు. సుధీర్‌రెడ్డి చిత్రపటాన్ని చెప్పులతో కొడుతూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బానోతు సుజాత మాట్లాడుతూ.. కొంత కాలంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తనను వేధింపులకు గురిచేస్తూ మాట్లాడుతున్నారని, అవమానిస్తున్నారని కంటతడి పెట్టారు. గిరిజన మహిళనైన తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా మాట్లాడే నీచానికి ఒడిగట్టిన సుధీర్‌రెడ్డి.. తనతో పాటు తన కుటుంబ సభ్యులనూ మానసిక క్షోభకు గురిచేశారని విలపించారు. తనకు జరిగిన ఈ అవమానం మరో గిరిజన మహిళకు జరగరాదన్నారు. ఆయనపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. సుధీర్‌రెడ్డిని అరెస్ట్ చేసేంత వరకు వదిలిపెట్టేది లేదన్నారు. ఈ నిరసనలో లింగాల కిశోర్‌గౌడ్, చెన్నగోని రవీందర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సత్యనారాయణ, పాశం అశోక్‌గౌడ్, నేలపాటి రామారావు, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌గా వెంకన్నకు పదోన్నతి

- ఆత్మీయ వీడ్కోలు పలికిన దిల్‌సుఖ్‌నగర్ డిపో సిబ్బంది



వెంకన్నకు ఆత్మీయ వీడ్కోలు పలుకుతున్న కంట్రోలర్లు, సిబ్బంది

చాదర్‌ఘాట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోలో సీఐగా పనిచేస్తున్న వెంకన్న సోమవారం హస్నాబాద్ డిపో మేనేజర్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు ఆయనకు దిల్‌సుఖ్‌నగర్ డిపో కంట్రోలర్లు, డ్రైవర్లు, కండక్టర్లు డిపోలో జరిగిన కార్యక్రమంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ పరిరక్షణకు సిబ్బంది అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. తనకు డిపో మేనేజర్‌గా పదోన్నతి రావడం చాలా ఆనందాన్ని కలిగించిందన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

చాదర్‌ఘాట్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపో నుంచి నడిచే అన్ని రకాల బస్సుల ద్వారా ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందించేందుకు అవసరమైన సలహాలు, ఫిర్యాదులు, సూచనలు పొందేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ సమత తెలిపారు. మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు 9959226137 ద్వారా డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో పాల్గొనాలని ఆమె ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్సీ దయాకర్‌కు సన్మానం

ఎల్‌బీనగర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ శాసన మండలి సభ్యులుగా ఎన్నికైన అద్దంకి దయాకర్‌ను రాష్ట్ర మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా బాలకిషన్ మాట్లాడుతూ తెలంగాణలో చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం ఎస్సీలకు ఇచ్చిన హామీ ప్రకారం 18 శాతం వచ్చే విధంగా కృషిచేయాలని కోరారు. వర్గీకరణ వల్ల మాలలకు అన్యాయం జరగకుండా చూడాలని ఈ విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ మాల సంఘాల నాయకులు మాదరి శివకుమార్, దారా సత్యం తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టించడం కాదు.. ప్రతిపక్షంలోనూ పనిచేయడం నేర్చుకోండి

- కార్పొరేటర్లకు కనీస మర్యాద ఇవ్వండి : నర్సింహారెడ్డి




అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తన రాజకీయ జీవితంలో ప్రతిసారి అధికార పక్షంలోనే ఉండి పని చేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఒక్కసారిగా ప్రతిపక్ష హోదా రావడంతో తట్టుకోలేకే మన్సూరాబాద్‌లోనే కాకుండా నియోజకవర్గంలోని దాదాపు అన్ని డివిజన్లలోనూ తన కార్యకర్తలను ఉసిగొలిపి అల్లర్లకు తెగబడుతున్నాడని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి ఘాటుగా విమర్శించారు. డివిజన్ పరిధిలోని రూ.18లక్షలతో సరస్వతినగర్, రూ.21.50లక్షలతో విజయనగర్‌కాలనీ, రూ.10.50లక్షలతో వీరన్నగుట్టలో సీసీరోడ్లు, రూ.10లక్షలతో చేపట్టిన ఓపెన్‌జిమ్‌ను సోమవారం కార్పొరేటర్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం చేశారు. కాగా ఈ పనులకు ఎమ్మెల్యే బుధవారం శంకుస్థాపనలు చేయగా అవే పనులకు శంకుస్థాపనలు ఎలా చేస్తారంటూ బీఆర్ఎస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అనంతరం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సింహారెడ్డి మాట్లాడుతూ నామమాత్రపు సమాచారంతో తాను లేకుండా అభివృద్ధి పనులకు అధికారులు లేకుండా అనధికారికంగా శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే.. అదే పని తాను చేస్తే స్థానిక బీఆర్ఎస్ నాయకులు, బయట నుంచి కొంతమంది యువతను ఉసిగొలిపి అల్లర్లు సృష్టించడం ఏమిటని ప్రశ్నించారు. తాను 20 ఏళ్లుగా ప్రతిపక్షంలోనే ఉంటూ డివిజన్‌లో ఎలాంటి అల్లర్లకు తావు లేకుండా అభివృద్ధి చేశానని, ఒక్కసారి ప్రతిపక్షంలో ఉండటాన్ని తట్టుకోలేక కార్పొరేటర్లకు కనీస గౌరవం ఇవ్వకుండా ఎమ్మెల్యే అల్లర్లకు తెగబడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ప్రశాంతంగా ఉన్న డివిజన్‌లో వివాదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ధర్మరావు, నర్సింహారావు, కడారి యాదగిరి, రోహిత్ పరంకుశం, కోటయ్య, ఎం.రవి, బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి, నాయకులు రామేశ్వర్, ఆదినారాయణ, కొండల్‌రెడ్డి, యంజాల జగన్, కృష్ణారెడ్డి, శ్రీధర్ గౌడ్, బాలాజీనాయుడు, లింగాచారి, మాధవి, మంగిరెడ్డి పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- హస్తినాపురం కార్పొరేటర్ బానోత్ సుజాతానాయక్



ఏసీపీ కృష్ణయ్యకు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు సుజాత, రాజశేఖర్‌రెడ్డి తదితరులు

కొత్తపేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అసభ్యకరంగా, అనుచితంగా తనపై వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని సోమవారం హస్తినాపురం కార్పొరేటర్ బానోత్ సుజాత ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్యకు ఫిర్యాదు చేశారు. తొలుత ఎస్‌హెచ్ఓ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు పత్రం అందజేశారు. అనంతరం ఆమె ఎల్బీనగర్ పీఎస్ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ కన్నీటిపర్యంతమయ్యారు. సోమవారం రాచకొండ ఎల్బీనగర్ డీసీపీ కార్యాలయం వద్ద విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ హస్తినాపురం, చంపాపేట, మన్సూరాబాద్ కార్పొరేటర్లకు కాంగ్రెస్ పార్టీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, ఎల్బీనగర్ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్‌తో హనీమూన్ నడుస్తుందని వ్యాఖ్యానించారన్నారు. తనకు హనీమూన్ అంటే తెలియదని అన్నారు. అలాంటి అసభ్యకర వ్యాఖ్యలు చేయడంతో తన మనోభావాలు, కుటుంబ సభ్యుల మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. తన వ్యక్తిత్వాన్ని దిగజార్చేలా, చులకన భావం కలిగేలా ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సబబు అని ఆమె ప్రశ్నించారు. తాను లంబాడా కులానికి చెందిన మహిళా ప్రతినిధినని తెలిసి ఎమ్మెల్యే తనను, కుటుంబ సభ్యులనూ మనోవేదనకు గురిచేశారని ఆరోపించారు. తనపై అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేపై నిర్భయచట్టం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, కఠినంగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ బానోత్ సుజాత పోలీసులకు విజ్ఞప్తి చేశారు. మహిళా కార్పొరేటర్‌పై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన సుధీర్‌రెడ్డిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి జైలుకు పంపాల్సిందేనని లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నాయకులు బుడ్డ సత్యనారాయణ, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, షేక్ షకీర్, కార్తీక్, నీలపాటి రామారావు, గోపాల్, గిరిజన సంఘాల నాయకులు, పాల్గొన్నారు. అనంతరం వారు కామినేని చౌరస్తా సమీపంలో ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశారు.

ప్రమాదాల నివారణకు నిబంధనలు పాటించాలి



రోడ్డుభద్రతపై హీరోమోటో కార్ప్, నుక్కడ్ టీమ్ ప్రదర్శన

కొత్తపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతకు నిబంధనలు పాటించాలని నుక్కడ్ టీమ్ బృందం సూచించింది. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై హీరోమోటో కార్ప్, రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ), పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కు సిబ్బంది ఆధ్వర్యంలో నుక్కడ్ అవగాహన ప్రదర్శనలు, గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సోమవారం నుక్క డ్ టీమ్ లీడర్ నవీన్ బృందం మన్నెగూడ ఆర్‌టీఏ కార్యాలయం, నాచారం టైమ్స్ ఆఫ్ ఇండియా ఐడీఏ ఆవరణల్లో ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యత, నిబంధనలు పాటించకపోతే ఎదురయ్యే సమస్యలపై ప్రదర్శనలు చేశారు. కార్యక్రమాల్లో టీటీఐ ఎస్ఐ నర్సింహారావు, సిబ్బంది రమేష్, హీరోమోటో కార్ప్ సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్, నుక్కడ్, నవీన్ బృందం పాల్గొన్నారు.

ఫర్నిచర్ షాపులో చోరీ

కొత్తపేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలోని ఫర్నిచర్ షాపు షట్టర్ తాళం పగులగొట్టి గుర్తుతెలియని దుండగులు రూ.50వేలు చోరీ చేశారు. ఎస్‌హెచ్ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మన్సూరాబాద్ సరస్వతీనగర్‌లో ఉండే చర్క సాయికిరణ్ కామినేని ఫ్లైఓవర్ సమీపంలో ఫర్నిచర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆయన ఈనెల 16న రాత్రి రూ.50వేలు ఆఫీస్ అల్మారాలో దాచి తాళం వేశారు. తర్వాత ఆయన దుకాణం షట్టర్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లారు. సోమవారం ఆయన దుకాణానికి చేరుకుని చూసే సరికి గుర్తు తెలియని దుండగులు షట్టర్ తాళం పగులగొట్టినట్లు గుర్తించారు. లోపలికి వెళ్లి చూస్తే అల్మారా తాళం పగులగొట్టిన దుండగులు అందులో దాచిన రూ.50వేలు ఎత్తుకెళ్లారని తెలుసుకున్నారు. వెంటనే ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయికి బానిసైన ఆటో దొంగ అరెస్టు



నిందితుడు హనీఫ్ ఖురేషిని అరెస్టు చేస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బంది

చాదర్‌ఘాట్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): దొంగిలించిన ఆటోతో సంచరిస్తున్న వ్యక్తిని సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి చాదర్‌ఘాట్ పోలీసులు అరెస్టు చేశారు. చాదర్‌ఘాట్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాబాద్ ప్రాంత నివాసి మహ్మద్ హనీఫ్ ఖురేషీ(23) రాపిడో రైడర్. రాపిడో నడపగా వచ్చిన డబ్బులతో చేసే జల్సాలకు సరిపోకపోవడంతో ఆటో నడపాలని నిర్ణయించుకున్నారు. గంజాయికి బానిసైన హనీఫ్ ఖురేషీ ఆటోను దొంగిలించాలని పథకం వేస్తున్నాడు. ఈనెల 10వ తేదీన అక్బర్‌బాగ్‌లోని న్యూ మలక్‌పేటలో పార్క్‌చేసి ఉన్న ఆటోను దొంగిలించాడు. దొంగిలించిన ఆటోను తానే నడిపి డబ్బులు బాగా సంపాదించాలనుకున్నాడు. ఈమేరకు ఆటో డ్రైవర్ హస్సేన్ నుంచి ఫిర్యాదు అందుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, చాదర్‌ఘాట్ పోలీసులతో కలిసి ఆదివారం అర్ధరాత్రి చాదర్‌ఘాట్ ఆజంపుర చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తుండగా హనీఫ్ ఖురేషీ నడుపుతున్న ఆటోను ఆపారు. ఆటోకు సంబంధించిన పత్రాలను చూపకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చి విచారణ జరపగా న్యూ మలక్‌పేట నుంచి దొంగిలించిన ఆటో అని బయటపడింది. ఈమేరకు పోలీసులు ఆటోను స్వాధీనం చేసుకుని నిందితుడు హనీఫ్ ఖురేషీని అరెస్టు చేశారు. కేసును చాదర్‌ఘాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.